క్లుప్తంగా

మౌలిక సదుపాయాల కల్పనకు కృషి



డ్రైనేజీ నిర్మాణ పనులను పరిశీలిస్తున్న సర్పంచ్ అప్పారావు

మునగపాక: గ్రామానికి అవసరమయ్యే మౌలిక సదుపాయాలను కల్పించేందుకు పాలకవర్గం కృషి చేస్తుందని మునగపాక సర్పంచ్ దిమ్మల అప్పారావు తెలిపారు. స్థానిక మెయిన్‌రోడ్డులో లింగరాయి గుడి పక్కన రూ.4 లక్షలతో నిర్మిస్తున్న డ్రైనేజీ పనులను ఆయన ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ డ్రైనేజీ పనులు చేస్తున్నామన్నారు. అవసరం మేర రహదారుల నిర్మాణం జరుగుతుందన్నారు. ప్రజా సమస్యల పరిష్కారానికి పాలకవర్గం కృషి చేస్తుందన్నారు. వీధి దీపాల నిర్వహణ, తాగునీరు, పారిశుధ్యం మెరుగుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. గ్రామాభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. ఆయన వెంట వార్డు సభ్యులు రామచంద్రరావు, దాడి పోలీసు తదితరులు ఉన్నారు.

రామానుజన్‌కు ఘన నివాళి



రామానుజన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న దృశ్యం

ఎస్.రాయవరం: మహాత్మాగాంధీ జ్యోతిరావు పూలే పాఠశాలలో గణిత పితామహుడు శ్రీనివాస రామానుజన్ జయంతి వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపాల్ కె.లక్ష్మి విద్యార్థులతో గణితంలో పలు అంశాలపై ప్రయోగాత్మక వివరణలు చెప్పించారు. ఇందులో ప్రతిభ చూపిన వారికి బహుమతులు అందజేశారు. గణిత ఉపాధ్యాయినిని సహ ఉపాధ్యాయులు, విద్యార్థులు సత్కరించారు. అంతకుముందు రామానుజన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

గ్రామాల్లో హరిదాసుల సందడి



నాగులాపల్లిలో హరిదాసు

మునగపాక: గ్రామాల్లో హరిదాసుల సందడి మొదలైంది. ధనుర్మాస ఉత్సవాలు ప్రారంభం కావడంతో ఇంటింటికీ తిరుగుతూ హరినామ కీర్తనలు ఆలపిస్తూ ఆధ్యాత్మిక చైతన్యాన్ని పంచుతారు. ప్రజలు సైతం తమ ఇంటికి వచ్చే హరిదాసులకు బియ్యం సమర్పించి తమ భక్తిని చాటుకుంటారు. ఈ విధంగా సమర్పించడం వల్ల కోరిన కోర్కెలు నెరవేరుతాయన్న నమ్మకం వారిలో ఉంది. వచ్చే నెల 13వ తేదీ భోగి పండుగ వరకు హరిదాసుల సందడి కనిపిస్తుంది. ఆదివారం నాగులాపల్లిలో హరిదాసు హరినామ స్మరణలు వినిపించాడు.

ఘనంగా ఆంధ్ర బాప్టిస్టు చర్చి వార్షికోత్సవం



ప్రత్యేక ప్రార్థనలు చేయిస్తున్న పాలకవర్గ సభ్యులు

యలమంచిలి రూరల్: పట్టణంలోని పురాతన ఆంధ్ర సెంటినరీ బాప్టిస్టు చర్చి 106వ వార్షికోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. వందేళ్లకు పైగా చరిత్ర కలిగిన చర్చిలో క్రైస్తవులంతా ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రేమ విందు ఇచ్చారు. చర్చికి వెళ్లే వారంతా కుటుంబ సమేతంగా విందులో పాల్గొన్నారు. వార్షికోత్సవ నివేదికను అందరికీ తెలియజేశారు. కార్యక్రమంలో చర్చి పాలకవర్గ సభ్యులు టీ మోజేస్, పీవీ రమణ, టీ ఆనంద రాజు, ఇ ప్రకాశరావు, వీ రాజేష్ పైలెట్, పీ సురేష్ పాల్గొన్నారు.

యథేచ్ఛగా గ్రావెల్ దందా

కూటమి నాయకులు కాసుల యావలో పడ్డారు. అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లోనే సహజ వనరుల దోపిడీకి తెరతీశారు. అధికారాన్ని అడ్డం పెట్టుకుని కొండల్ని పిండేస్తున్నారు. కంకర భూములను తవ్వేస్తున్నారు. అక్రమంగా గ్రావెల్ తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. ఈ విషయంలో అధికారులు చోద్యం చూస్తుండటంతో విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

- అనుమతుల్లేకుండా తవ్వకాలు
- కొండల్ని పిండేస్తున్న మాఫియా
- కన్నెత్తి చూడని మైనింగ్ అధికారులు

గ్రావెల్ తవ్వకాల నిబంధనలు ఇలా..

గ్రావెల్ తవ్వకాలు చేపట్టాలంటే మైనింగ్, రెవెన్యూ, అధికారుల నుంచి ముందస్తు అనుమతులు తీసుకోవాలి. ప్రభుత్వానికి సీనరేజ్ చెల్లించాలి. గ్రావెల్‌ను ఎక్కడ వినియోగిస్తున్నారో వివరింగా తెలియజేయాలి. ప్రజా అవసరాల కోసం మాత్రమే వినియోగిస్తున్నట్లు ధ్రువపత్రాలు సమర్పించాలి. కంపెనీ అవసరాల కోసమైతే యాజమాన్యాలే ప్రభుత్వానికి దరఖాస్తు చేసుకోవాలి. కానీ నియోజకవర్గంలో ఇవేమీ లేకుండానే ప్రభుత్వ పెద్దల అండదండలు, నాయకులే మాఫియాగా మారి ఇష్టానుసారం గ్రావెల్ తరలిస్తున్నారు.

నిర్మాణంలో కంపెనీలకు తరలింపు...

పాయకరావుపేట మండలం కందిపూడి తదితర ప్రాంతాల నుంచి గ్రావెల్‌ను పొరుగు జిల్లాల్లో నిర్మాణంలో ఉన్న కంపెనీలకు పెద్ద లారీల్లోనే తరలిస్తున్నారన్న ప్రచారం జరుగుతోంది. దీని వెనుక కూటమి ప్రభుత్వంలో పెద్ద నాయకులే ఉన్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఒక్కొక్క లారీపై 20 టన్నులకు పైగా గ్రావెల్‌ను నింపి తుని, పిఠాపురం, తొండంగి గొల్లప్రోలు, కాకినాడ పరిసర ప్రాంతాల్లో నిర్మాణంలో ఉన్న పెద్ద పెద్ద కంపెనీలకు తరలిస్తున్నారు. లారీ ధర రూ.12 వేల నుంచి రూ.15 వేలకు విక్రయిస్తున్నారన్న ప్రచారం జరుగుతోంది. నక్కపల్లి మండలంలో చందనాన, నర్సాపురం ప్రాంతాలతోపాటు, అమలాపురం, దొండవాక, పెదతీనార్ల, వేంపాడు రాజయ్యపేట, డీఎల్‌పురం గ్రామాల పరిధిలో ఏపీఐఐసీ వారు సేకరించిన భూములు, కొండల నుంచి పొక్లెయిన్‌లతో తవ్వి సమీపంలో కంపెనీలకు విక్రయిస్తున్నారు. కూటమి ప్రభుత్వం పల్లె పండగ పేరుతో పలు గ్రామాలకు మంజూరు చేసిన గ్రావెల్ రోడ్లకు సైతం అనుమతులు లేకుండా గ్రావెల్ తవ్వకాలు చేపట్టి వినియోగిస్తున్నారు.



కందిపూడి పరిసరాల్లో పొక్లెయిన్‌తో గ్రావెల్ తవ్వుతున్న మాఫియా



ఎస్. నర్సాపురం సమీపంలో గ్రావెల్ తవ్వకాలు

నక్కపల్లి: ఎవరేమనుకున్నా... ఎన్ని విమర్శలు వచ్చినా.. గ్రావెల్ మాఫియా అక్రమ దందా యథేచ్ఛగా సాగిస్తోంది. అధికార పార్టీ నాయకులే రేయింబవళ్లు అని తేడా లేకుండా అక్రమంగా గ్రావెల్ తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. పాయకరావుపేట నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో అనుమతుల్లేకుండా తవ్వకాలు జరిపి లక్షలాది రూపాయలు సంపాదిస్తున్నారు. మాఫియా ఆగడాలు రోజు రోజుకు మితి మీరిపోతున్నాయి. కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత సహజ వనరుల దోపిడీ మరీ ఎక్కువయిందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రకృతి వైపరీత్యాల నుంచి కాపాడే కొండలను పిండేస్తున్నారు. వాటిని తొలచి కంపెనీలకు విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. నక్కపల్లి మండలంలో చందనాడ, ఎస్. నర్సాపురం, నీలకుండీలు, మూలపర, ఉపమాక తదితర గ్రామాలతోపాటు పాయకరావుపేట మండలంలో కందిపూడి, ఎస్. నర్సాపురం, పి.ఎల్.పురం, సీతారామపురం తదితర గ్రామాల్లో కొండల నుంచి పోలవరం కాలువ గట్ల నుంచి నిత్యం వందలాది ట్రాక్టర్లపై గ్రావెల్ తవ్వి తరలిస్తున్నారు.

అధికారుల చోద్యం..

ఆదేవిధంగా పోలవరం కాలువ గట్ల నుంచి సైతం కంకర మట్టిని తరలిస్తున్నారు. ఇదంతా సంబంధిత శాఖల అధికారులకు తెలిసినప్పటికీ పట్టించుకోవడం లేదు. ఒకవేళ ఎవరైనా పట్టించిన వెంటనే మండల, నియోజకవర్గ స్థాయి నాయకుల నుంచి ఒత్తిళ్ల రావడంతో కేసులు నమోదు చేయకుండా వదిలేస్తున్నారు. నిత్యం లక్షలాది క్యూబిక్ మీటర్ల గ్రావెల్ అక్రమంగా తరలిపోతున్నా, మైనింగ్ అధికారులు కన్నెత్తి చూడటం లేదు. ఈ శాఖ అధికారులు డ్యూటీలు చేస్తున్నారా లేదా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. నెలకొకసారైనా గ్రామీణ ప్రాంతాల వైపు మైనింగ్ అధికారులు వచ్చి దాడులు చేయడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు.

సామాన్యులకు భారమైన గ్రావెల్ ధర..

సామాన్యులు తమ ఇళ్ల పునాదులు నింపుకోవడానికి కూడా వేలాది రూపాయలు పెట్టి గ్రావెల్ కొనాల్సి వస్తోందని లబ్ధిదారులు వాపోతున్నారు. ఇసుక, గ్రావెల్ ఫ్రీ అని ప్రభుత్వం చెబుతున్నా, మాఫియా మాత్రం ట్రాక్టరు ఇసుక రూ.4 వేలకు, గ్రావెల్ రూ.2 వేలకు విక్రయిస్తోందని సామాన్య, మధ్యతరగతి ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి గ్రావెల్ మాఫియాకు అడ్డుకట్ట వేయాలని కోరుతున్నారు.

పూడిమడక రోడ్డు విస్తరణ బాధితులకు మెరుగైన పరిహారం



రోడ్డు విస్తరణ బాధితులతో మాట్లాడుతున్న తహసీల్దార్ ఆదిమహేశ్వరరావు

మునగపాక: పూడిమడక రోడ్డు విస్తరణ బాధితులకు మెరుగైన పరిహారం అందజేస్తామని తహసీల్దార్ ఎస్.ఆదిమహేశ్వరరావు తెలిపారు. రహదారి విస్తరణ ప్రక్రియ వేగవంతమయ్యేలా సహకరించాలన్నారు. మునగపాక పంచాయతీ కార్యాలయంలో ఆదివారం బాధితులతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పూడిమడక రోడ్డును విస్తరించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రమాదాల నివారణతో పాటు ఈ ప్రాంతం మరింత అభివృద్ధి చెందుతుందన్నారు. పరిహారం పెంపు విషయం తన పరిధిలో లేదని, కలెక్టర్‌తోపాటు ఎమ్మెల్యే విజయకుమార్ దృష్టికి తీసుకువెళ్లాల్సిన అవసరం ఉందన్నారు. ఈ క్రమంలో కొంతమంది బాధితులు తమ నివాసాలు పూర్తిగా దెబ్బతింటాయని, ఇందుకోసం ప్రత్యామ్నాయంగా మరోచోట స్థలాలు మంజూరు చేయాలని కోరారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి బొడ్డేడ ప్రసాద్, పెద్దలు టెక్కలి పరశురామ్, దాడి ముసిలినాయుడు, విస్తరణ బాధితులు సూరిశెట్టి కన్నారావు, ఆడారి అప్పలనాయుడు, పొలమరశెట్టి జగ్గప్పలనాయుడు, పెంటకోట జగన్నాథరావు మాస్టారు, కాండ్రేగుల జగ్గారావు, ఆడారి అచ్చియ్యనాయుడు, ఏవీ సత్యనారాయణ, బొడ్డేడ అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

అరబుపాలెంలో నేడు రెవెన్యూ సదస్సు

మునగపాక: అరబుపాలెంలో సోమవారం రెవెన్యూ సదస్సు నిర్వహించనున్నట్లు తహసీల్దార్ ఎస్.ఆదిమహేశ్వరరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సచివాలయ ఆవరణలో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు తిరిగి 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరిగే సదస్సును రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

వరి కోత పనుల్లో రైతులు



కొరుప్రోలులో కోతలు చేస్తున్న రైతులు

ఎస్.రాయవరం: తుఫాన్ ముప్పు తప్పడంతో మండలంలో ఆదివారం మరలా వరి కోతలు మొదలయ్యాయి. చేను పూర్తిగా పండటంతో కోతలు వీలైనంత తొందరగా చేసి కుప్పలు వేసుకునేందుకు అన్నదాతలు హైరానా పడుతున్నారు. రెండు రోజుల క్రితం వర్షాలకు కోత చేసి పనలపై ఉన్న చేళ్లు పూర్తిగా తడిచాయి. ఇంకా పొలాల్లో ఉన్న పంటను వర్షం తగ్గేసరికి కోతలు ప్రారంభించారు. వారం రోజులు వర్షాలు సమస్య లేకుండా ఉంటే 90 శాతం కోతలు పూర్తవుతాయని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. మండలంలో 8 వేల ఎకరాలకుగాను ఇప్పటి వరకు 40 శాతం వరి కోతలయ్యాయని వ్యవసాయాధికారి సౌజన్య చెబుతున్నారు.

విద్యార్థులు ఉత్తమ పౌరులుగా ఎదగాలి



సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించిన విద్యార్థినులు

పాయకరావుపేట: విద్యార్థులు ఉత్తమ పౌరులుగా ఎదగాలని సీఐ జి.అప్పన్న తెలిపారు. పట్టణంలోని కనోస్సా ఇంగ్లిషు మీడియం స్కూల్ వార్షికోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సీఐ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులకు విద్యతోపాటు క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతో ముఖ్యమన్నారు. అనంతరం విద్యార్థులతో సాంస్కృతిక కార్యక్రమాలు తిలకించారు. కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారులు కె.ఎస్.గాంధీ, రమేష్‌బాబు, పాఠశాల యాజమాన్యం సిస్టర్ డైసీ ఆంటోని, ఫాదర్స్ రాజ్‌కుమార్, జయప్రసాద్, ప్రిన్సిపాల్ సంతాన థామస్, మేనేజర్ సిస్టర్ అలెక్సిస తదితరులు పాల్గొన్నారు.

అక్రమంగా ఇసుక నిల్వలు

ఆపై అధిక ధరకు విక్రయాలు



అడ్డురోడ్డు సమీపంలో ఇసుక నిల్వలు



కోనవానిపాలెంలో ఇసుక నిల్వలు

ఎస్.రాయవరం: మండలంలో ఇసుక అక్రమ రవాణా యథావిధిగా కొనసాగుతోంది. అక్రమార్కులు ఖాళీ ప్రదేశాల్లో బహిరంగంగా నిల్వ చేసి విక్రయాలు చేస్తున్నారని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కోటవురట్ల మండలం పందూరు ర్యాంపు నుంచి రూ.వెయ్యి నుంచి రూ.15 వందలు చెల్లించి ఇసుకను తీసుకు వస్తున్నామని చెబుతూ మండలంలో అడ్డురోడ్డు, పెదగుమ్ములూరు, తిమ్మాపురం తదితర ప్రాంతాల్లో నిల్వ చేసి విక్రయాలకు పాల్పడుతున్నారు. ప్రభుత్వం చెప్పిన ఉచిత ఇసుక నిబంధనలు తుంగలో తొక్కి ముందుగా ఇసుక స్టాక్ చేసి, డిమాండ్ ఉన్న సమయంలో అధిక ధరకు విక్రయించుకోవచ్చన్న ఆలోచనతో ఉన్నారు. నిర్మాణాలు పేరుతో తరలించిన ఇసుక వారివారి స్థలాల్లో భద్రపరచుకుంటున్నారు. ఈ మేరకు తహసీల్దార్ రమేష్‌బాబును వివరణ కోరగా, ఇళ్ల నిర్మాణాలు చేసుకునేవారు పంచాయతీ కార్యదర్శి నుంచి అనుమతులు తీసుకుని అవసరమైన మేర మాత్రమే తెచ్చుకోవాలన్నారు. అక్రమ రవాణాకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవన్నారు. ఇసుక నిల్వలు పరిశీలించి చర్యలు తీసుకుంటామన్నారు.

మునగపాకలో కుంగిన రోడ్డు

వాహనదారులకు ఇబ్బందులు



మునగపాక దరి కుంగిన రోడ్డు

మునగపాక: పూడిమడక రోడ్డు కుంగిపోవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అనకాపల్లి జాతీయ రహదారి నుంచి అచ్యుతాపురం వరకు 14 కిలోమీటర్ల మేర ఇటీవల రూ.7 కోట్లతో రహదారి నిర్మించారు. అయితే మునగపాక సమీపంలో కొంతమేర రహదారి కుంగిపోయింది. భారీ వాహనాల రాకపోకలతో పాటు రహదారిని ఆనుకుని సాగునీటి కాలువ ఉండడంతో రోడ్డు కొంతమేర దెబ్బతింది. దీంతో ఈ మార్గంలో రాకపోకలు సాగించేవారు ఇబ్బందులు పడుతున్నారు. రాత్రుల సమయంలో రాకపోకలు సాగించేవారు భయాందోళనకు గురవుతున్నారు. ఎప్పుడు ఎలాంటి ప్రమాదం జరుగుతుందోనని ఆందోళన చెందుతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి తగు చర్యలు తీసుకుని ప్రయాణికులకు ఇబ్బందులు లేకుండా చూడాలని కోరుతున్నారు.

ఆనాటి ఆ స్నేహం ఆనందగీతం

ఎన్నోయేళ్ల అనుబంధం వారిది.. వివిధ రంగాల్లో ఎక్కడెక్కడో స్థిరపడిన వారంతా తిరిగి ఒక్కసారిగా కలుసుకోవడంతో ఆనందం వెల్లివిరిసింది. తమ బాల్య జ్ఞాపకాలు సినిమా రీల్‌లా గిర్రున తిరుగుతుంటే, అక్షరాలను నేర్చుకున్న బడిలో గడిపిన ఆనంద క్షణాలు గుర్తుకొచ్చాయి. తరగతి గదిలో పాఠాలు నేర్పిన మాస్టారును ఆట పట్టించిన చిలిపి చేష్టలు నవ్వులు పూయించాయి. అవన్నీ.. ఈనాటి తీపి గురుతులు! మరోసారి గుర్తుకు తెచ్చుకుంటూ ఆనందంగా గడిపారు పూర్వ విద్యార్థులు.



అనకాపల్లి సత్యనారాయణమూర్తి కొండ ఆవరణలో కలుసుకున్న పూర్వ విద్యార్థులు



మునగపాక హైస్కూల్‌లో కుటుంబ సభ్యులతో పూర్వ విద్యార్థులు



అనకాపల్లి కొత్తూరులో కలుసుకున్న గణపర్తి హైస్కూల్‌లో చదువుకున్న పూర్వ విద్యార్థులు



పాటిపల్లి లక్ష్మీనరసింహం ఆలయ ప్రాంగణంలో మాడుగుల్లో గ్రంథాలయం సభ్యులు

మునగపాక: పూర్వ విద్యార్థులు పలు చోట్ల ఆదివారం ఆత్మీయ సమావేశాలు జరుపుకున్నారు. మునగపాక జిల్లా పరిషత్ హైస్కూల్‌లో 1998–99లో పదో తరగతి చదువుకున్న విద్యార్థులంతా ఆదివారం అదే స్కూల్‌లో కుటుంబ సభ్యులతో ఆత్మీయ సమావేశమయ్యారు. ఒకరికొకరు పలకరించుకొని ఉత్సాహంగా గడిపారు. హైస్కూల్‌లో చదువుకొని 25 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా నాటి తీపి జ్ఞాపకాలను గుర్తుకు తెచ్చుకున్నారు. నాడు విద్య నేర్పిన గురువులను ఘనంగా సత్కరించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆట పాటలతో సందడి చేశారు.

- మునగపాక హైస్కూల్‌లో 1974లో పదో తరగతి చదువుకున్న విద్యార్థులు ఆదివారం అనకాపల్లిలోని సత్యనారాయణమూర్తి కొండ దరి ఆత్మీయ సమావేశం నిర్వహించారు. పదో తరగతి చదువుకొని 50 సంవత్సరాలు పూర్తవ్వడంతో పూర్వ విద్యార్థులు ఉదయం నుంచి సందడి చేశారు. నాడు విద్య నేర్పిన గురువులు కేవీ గౌరీపతి, జీవీ అప్పారావులను ఘనంగా సత్కరించారు.
- మండలంలోని పాటిపల్లి మాడుగుల్లో గ్రంథాలయం సభ్యులు సమీపంలోని లక్ష్మీనరసింహస్వామి ఆలయ ప్రాంగణంలో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆటల పోటీలు నిర్వహించి ఉత్సాహంగా గడిపారు. విజేతలకు పర్యావరణాన్ని పరిరక్షించడంలో భాగంగా గుడ్డ సంచులను పంపిణీ చేశారు.
- గణపర్తి జిల్లా పరిషత్ హైస్కూల్‌లో 1999–2000లో పదో తరగతి చదువుకున్న విద్యార్థులు ఆదివారం అనకాపల్లి కొత్తూరులోని శ్రీనివాస కల్యాణ మండపంలో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. పది పూర్తి చేసి 25 సంవత్సరాలు గడిచిన నేపథ్యంలో నాటి విద్యార్థులంతా ఉత్సాహంగా గడిపారు.

నూకాంబికకు దీపపు కుందులు బహూకరణ



నూకాంబికను దర్శించుకుంటున్న డ్వామా పీడీ తారక వెంకట రాజేశ్వరరావు దంపతులు



రాజేశ్వరరావు సమకూర్చిన రూ.15వేల విలువ చేసే కుందులు

మునగపాక: తూర్పుగోదావరి జిల్లా డ్వామా పీడీ శరగడం తారక వెంకట రాజేశ్వరరావు దంపతులు మండలంలోని తన స్వగ్రామం తిమ్మరాజుపేటలో నూకాంబిక అమ్మవారికి ఆదివారం రూ.15వేల విలువ చేసే దీపపు కుందులను బహూకరించారు. మాజీ సర్పంచ్ దివంగత ఎస్వీ రమణ జ్ఞాపకార్థంగా ఆలయ అభివృద్ధిలో భాగంగా తమవంతు సాయంగా కుమారుడు రాజేశ్వరరావుతో కలిసి కుందులు అందజేసి భక్తి భావం చాటుకున్నారు. ముందుగా నూకాంబిక అమ్మవారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ కాండ్రేగుల జగన్, పెద్దలు భీమరశెట్టి శ్రీనివాసరావు, మళ్ల స్వామి తదితరులు పాల్గొన్నారు.

సరుగుడు జలపాతం వద్ద సందడి

నాతవరం : సరుగుడు జలపాతం వద్ద ఆదివారం సందర్శకులతో సందడి నెలకొంది. రెండు కొండల నడుమ నుంచి ప్రవహించే నీటిలో జలకాలాడుతూ ఉదయం నుంచి సాయంత్రం వరకూ సందడి చేశారు. తాండవ అందాలను తిలకిస్తూ తాండవ ప్రాజెక్టు దిగువనున్న పార్కులో ఆట పాటలతో కాలక్షేపం చేశారు. సరుగుడు జలపాతం తాండవ రిజర్వాయరుకు వెళ్లే రోడ్డులో వాహనాల రద్దీతో ట్రాఫిక్ సమస్య నెలకొంది.

తూర్పు కాపులంతా ఐక్యంగా ఉండాలి

ఎంపీపీ బోదెపు గోవింద్



మాట్లాడుతున్న ఎంపీపీ బోదెపు గోవింద్

యలమంచిలి రూరల్: రాజకీయాలకు అతీతంగా తూర్పుకాపులంతా ఐక్యంగా ఉండాలని యలమంచిలి ఎంపీపీ బోదెపు గోవింద్ అన్నారు. ఆదివారం యలమంచిలి సమీపంలో నియోజకవర్గ తూర్పు కాపు సామాజిక వర్గం వనసమారాధనకు ఆయన హాజరై మాట్లాడారు. నియోజకవర్గంలో బలమైన సామాజిక వర్గంగా ఉన్న తూర్పు కాపుల సంక్షేమానికి నేతలంతా కృషి చేయాలని కోరారు. ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా తూర్పు కాపులు ఎదగాలని ఆకాంక్షించారు. కాపుల సంక్షేమానికి తామంతా కట్టుబడి ఉన్నామని ఎమ్మెల్యేలు సుందరపు విజయ్ కుమార్, పంచకర్ల రమేష్‌బాబు, రాష్ట్ర రహదారుల అభివృద్ధి సంస్థ చైర్మన్ ప్రగడ నాగేశ్వరరావు, మాజీ ఎంపీ పప్పల చలపతిరావు, వైఎస్సార్‌సీపీ నాయకులు బొద్దపు ఎర్రయ్యదొర, బెజవాడ నాగేశ్వరరావు తదితరులు చెప్పారు. వివిధ పదవుల్లో ఉన్న ప్రజాప్రతినిధులను ఘనంగా సత్కరించారు. తూర్పు కాపు సామాజిక వర్గం నాయకులు పాల్గొన్నారు.